క్లుప్తంగా

నేడు జోనల్‌స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో అండర్- 14, 17 (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) జోనల్‌స్థాయి బాలబాలికల స్విమ్మింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్‌తో ఉదయం 9 గంటలకు పోటీల కన్వీనర్ రాష్ట్రపాల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 77020 35200 సంప్రదించాలని కోరారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని తేజపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఏలేటి జీవన్‌రెడ్డి కుమారుడు మనోజ్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ వేర్వేరుగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారివెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్- 14, 17 బాలబాలికల జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ శివారు ప్రాంతంలోని చాందా క్రికెట్ మైదానంలో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో పోటీల ఆర్గనైజర్ వీజీఎస్ రాకేశ్‌కు మంగళవారం ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 97049 44283 సంప్రదించాలని కోరారు.

అన్నదానం అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: రోగుల సహాయకులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం బీజేపీ నాయకుడి పుట్టిన రోజు సందర్భంగా రిమ్స్‌లోని సత్యసాయి అన్నదాన కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాయిబాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. రోగుల సహాయకులకు భోజనం వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రస్ట్‌కు భవిష్యత్‌లో తనవంతు సహకారాన్ని అందిస్తానని పేర్కొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలతో గ్రామస్తులు, యువకులు

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామంలోని గ్రంథాలయానికి జామిడి గ్రామానికి చెందిన బి.నర్సింగ్ రెడ్డి రిటైర్డ్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రూ.6 వేల విలువైన పుస్తకాలను, 105 సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు, ఒక ఫ్యాను, పది కుర్చీలను అందించినట్లు తెలిపారు. ఆదివారం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. గ్రామస్తులు నారాయణ, గట్టు రవి, సంతోష్, వినోద్ రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నేరడిగొండ: యావత్ ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి అన్నారు. మండలంలోని 296వ పోలింగ్ బూత్ పరిదిలోని గుత్పాల గ్రామంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాజశేఖర్ పటేల్, లింగంపల్లి సురేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

నేరడిగొండ: జిల్లా మాల సంఘం ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లా మాల సంఘ కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిశారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

బోథ్ మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద గత మూడు నెలల క్రితం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రం నుంచి వచ్చిన ఓ అధికారి లారీని పరిశీలించారు. అప్పటికే లారీ డ్రైవర్ పారిపోయాడు. లారీని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచకుండా వదిలివేయడంలో లారీ డ్రైవర్ అర్ధరాత్రి వచ్చి ఇసుకను అన్‌లోడ్ చేసి లారీని తీసుకుపోయాడు. ఇక్కడ మైనింగ్ అధికారుల తీరు అనుమానాలకు తావిచ్చింది. పట్టుబడ్డ లారీ వివరాలు సేకరించలేదు. ఆర్టీవో అధికారులకు కూడా సమాచారం ఇవ్వలేదు. దీంతో సంబంధిత అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– బోథ్

- మహారాష్ట్ర నుంచి జిల్లాకు..
- వందల లారీల్లో తరలింపు
- ప్రభుత్వానికి లక్షల్లో రాయల్టీ ఎగవేత
- అక్రమార్కులకు అండగా.. అధికారులు



బోథ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఇసుక కుప్పలు



రాయల్టీ లేకుండా వచ్చిన ఇసుక లారీ

మహారాష్ట్ర నుంచి అదిలాబాద్ జిల్లాకు ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వానికి రాయల్టీ కట్టకుండా ఇసుకను జిల్లాకు తీసుకువస్తున్నారు. ఈ అక్రమ ఇసుక రవాణా దందాను అధికారులు, కొంతమంది కీలక నేతలు సక్రమంగా నడిచేలా చూస్తున్నారు. దీని వలన ప్రభుత్వం భారీగా ఆదాయానికి గండి పడుతుంది.

రోజుకు వంద లారీల్లో ఇసుక రవాణా అవుతోంది. తెలంగాణలో ఇసుక రవాణా చేయాలంటే తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక మెట్రిక్ టన్నుకు రూ.375 రాయల్టీగా టీఎస్ఎండీసీకి చెల్లించాలి. ఆన్‌లైన్‌లోనే ఇసుక రవాణాకు సంబంధిచి పాస్ లభిస్తుంది. ఇసుక తీసుకెళ్లే రూట్‌తో పాటు, దరఖాస్తు దారుడి పేరు, ఎక్కడి నుంచి ఎక్కడికి రవాణా అవుతుంది, సమయం, తేదీతో పాటు అనుమతి కాపీని అందిస్తారు.

పరిమితికి మించి రవాణా..

లారీలు పరిమితికి మించి ఇసుకను రవాణా చేస్తున్నాయి. ప్రభుత్వం విధించిన పరిమితి కంటే ఏకంగా 11 నుంచి 15 మెట్రిక్ టన్నుల ఇసుకను ఎక్కువగా రవాణా చేస్తున్నారు. దీనివల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఆర్‌టీఏ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. 14 టైర్ల లారీ 32 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఉంది. ఒక్కో లారీలో 45 మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేస్తోంది. 12 టైర్ల లారీ 26 మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేయాలి.. కానీ 35 మెట్రిక్ టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నారు.

పట్టింపులేని అధికారులు..

ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఓ మండలంలో అక్రమంగా ఇసుక వచ్చిందని మండలస్థాయి అధికారులకు సమాచారమిచ్చినా.. మా పరిధి కాదంటూ దాటవేయడం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. కాగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు అక్రమ ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుకను రాయల్టీ కట్టకుండా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థకు రాయల్టీ కట్టాలి. అలా కాకుండా ఇసుకను తరలిస్తే లారీలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తాం. అక్రమ ఇసుక తరలిస్తే సమాచారం అందించాలి.

– తారకనాథ రెడ్డి, టీఎస్‌ఎండీసీ పీడీ

గ్రామాల్లో దండారీ ఉత్సవాలు



గుస్సాడీలతో ఆడే గజేందర్

బోథ్: మండలంలోని ఆదివాసీగూడెల్లో దండారీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మండలంలోని పట్నాపూర్, లక్ష్మీపూర్, రేండ్లపల్లె, చింతగూడ, కంటెగాం, నిగిని, టివిటిపల్లె, వజ్జర్, పార్డి(బి), పార్డి(కె), గొల్లాపూర్, అందూర్, మహదుగూడతో పాటు పలు గ్రామాల్లో ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో దండారీ ఉత్సవాలు నిర్వహించారు. వజ్జర్ గ్రామంలో ఆదివాసీలు ప్రత్యేక వేషధారణ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కుమురం మానిక్ రావ్, మెస్రం భూమన్న, ఆత్రం పరుషోత్తం, భీంరావ్, నాగేందర్, విఠల్, మారుతి, మోహన్ పాల్గొన్నారు.

దండారీ ఉత్సవాల్లో ఆడే గజేందర్

నేరడిగొండ: దండారీ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మాధాపూర్, మంగల్ మోట గ్రామాల్లో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా గుస్సాడీ నృత్యం, డప్పువాయిద్యాలతో ఆదివాసీలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సత్కరించారు. గ్రామంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల కన్వీనర్ ఆడే వసంతరావు, రాజురెడ్డి, తొడసం శంకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక వేషధారణలో ఆదివాసీలు

ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆదేశానుసారం ప్రెస్‌మీట్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రాధాన్యమిస్తూ, వారి సమస్యలను తీరుస్తామన్నారు. ఉద్యకారులకు బోర్డు ఏర్పాటు చేసి, ఇళ్ల స్థలాలు హెల్త్‌కార్డులు, ఫ్రీబస్సు సౌకర్యం, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు సురేశ్, అప్పాల శ్రీనివాస్ రెడ్డి, సంగు స్వామి, బ్రహ్మానందం, తక్కల శ్రీనివాస్ రెడ్డి, గంగయ్య, ఆనంద్, సమీర్, రవూఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యమకారులు

ఉద్యోగులకు న్యాయం చేయాలి

ఎదులాపురం: 317 జీవో కారణంగా ఒక జిల్లా నుంచి మరోక జిల్లాకు బలవంతంగా నెట్టివేయబడిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర 317 జీవో డిస్లోకేటెడ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పడకంటి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 317 జీవోతో ఉద్యోగ, ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు. గత తొమ్మిది నెలలుగా దామోదర రాజనర్సింహ అధ్యక్షతన అనేక క్యాబినెట్ సమావేశాలు నిర్వహించగా.. స్పౌజ్, మీచువల్, మెడికల్ వారికి సొంత జిల్లాకు వెళ్లేందుకు ఆమోదించారని అన్నారు. జీవోతో జిల్లాలు మారిన ఉద్యోగులు, ఉపాధ్యాయులను తిరిగి సొంత జిల్లాకు పంపడంలో ఎలాంటి సమస్యలు లేవన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, రత్నమాల, మధుకర్‌రెడ్డి, అజయ్, సాయిరాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పడకంటి అజయ్‌కుమార్

మరాఠీ భాష అభివృద్ధికి కృషి చేయాలి



డీఎస్సీలో కొలువులు సాధించిన, ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మరాఠీ భాష అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని మరాఠీ బాషిక్ జన కల్యాణ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభాష్ రాథోడ్, అనిల్ సావులే అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌజింగ్‌బోర్డు సరస్వతి శిశు మందిర్‌లో మరాఠీ మీడియం ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడులేని విధంగా డీఎస్సీలో 21 మంది ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత కాలంలో మరాఠీ మీడియంకు ఆదరణ తగ్గిందని, ఇలాంటి తరుణంలో పలువురు ఉపాధ్యాయులు మరాఠీ అస్తిత్వాన్ని భావితరాలకు అందించేందుకు డీఎస్సీలో రాణించి ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. బేలలో మరాఠీ మీడియం కళాశాల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. మరాఠీకి పూర్వ వైభవం తీసుకొచ్చేలా ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఇటీవల డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన, ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్ గుర్నాలే, సుభాష్, మనోహర్, విజయ్, శివాజీ, విఠల్, బాపురావు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న సుగుణ, నాయకులు

ఉట్నూర్‌రూరల్: కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఆదివారం మండలంలోని దొంగచింత గ్రామంలో కుమురం భీం, కుమురం సూరు వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం భీం, సూరు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం పోరాడి అమరులైన మహానీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆదివాసీ గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాల సంఘం అభివృద్ధికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: మాల సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఇటీవల మాల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కాగా, ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు జోగు రామన్నను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల రమేశ్, సుధాకర్, యేర సుధీర్, మేకల మల్లన్న, గంపల ప్రభాకర్, మెట్టు ప్రహ్లాద్, స్వరూపరాణి, బేర దేవన్న, భగవాండ్లు, మొట్టే కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



సంఘం సభ్యులను సన్మానిస్తున్న జోగు రామన్న

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

బేల: మండలంలోని సాంగిడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదిలాబాద్ చెందిన ప్రముఖ వైద్య నిపుణులు సందీప్‌రెడ్డి, రంజిత్‌కుమార్, సాయికృష్ణ, ఇంద్రజ 300కు పైబడి రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనిల్‌కుమార్, సభ్యులు అనుముల ఉదయ్‌కిరణ్, నరేశ్, సుమన్, సునీల్, రవి, చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళం

బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2016- 17 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఏడేళ్ల తర్వాత ఒకేచోట కలుసుకోవడంలో అనాటి జ్ఞాపకలు నెమరు వేసుకున్నారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. ఒకరికొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకొని సందడిగా గడిపారు. భవిష్యత్‌లో తోటి మిత్రులకు ఏమైనా ఆపద వచ్చినా అండగా ఉందామని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో కోల నర్సింలు, పూర్వ విద్యార్థులు నిపుంగే సచిన్, శ్రీకాంత్, నావిద్, ప్రజ్వల్, నిలేష్, మౌనిక, పల్లవి, ప్రగతి, అనునాథ, నిఖిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇచ్చోడ: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి 2005-06 సంవత్సరంలో ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని జల్దా గ్రామానికి చెందిన అల్లెం రాములు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. ఆయన కుమార్తె అల్లెం రమకుమారి ఇచ్చోడలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుకుంటుంది. ఇటీవల స్పృహ తప్పి పడిపోవడంతో నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ఆర్‌నగర్‌కు చెందిన పవన్ అనే యువకుడు పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించి గతేదాది కాలంగా శారీరకంగా లొంగబర్చుకున్నాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని పేర్కొన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి



మండల అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుంజాల భాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నేరడిగొండ కమిటీని గుంజాల భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాథోడ్ కమల్ సింగ్, ఉపాధ్యక్షుడిగా దావుల భోజన్న, ఏలేటి మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు రమేశ్, కార్యదర్శులుగా జాదవ్ కపిల్‌దేవ్, చంద్రశేఖర్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా ఏలేటి మోహన్ రెడ్డి, రహీమ్, గాదె రవీందర్, కోశాధికారిగా జహీర్, షేక్ సలీంలను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



నాయకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మాల సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులు, కుమ్మరి సంఘం నూతన కమిటీ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కుల సంఘం నాయకులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ సత్కరించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పుల రమేశ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు మేకల మల్లన్న, ఉపాధ్యక్షుడు ఏరే సుధీర్, కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వెడ్మ రాము వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో వెడ్మ రాము వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఆదివాసీ హక్కుల కోసం వెడ్మ రాము అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. కుమరం భీం అనుచరుడిగా నైజాం వ్యతిరేకంగా పోరాటం చేశాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో తొటి సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం శేఖర్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, మాడావి భీంరావు, కొడప నగేశ్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ప్రైవేట్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీగా పోటీ చేసే అభ్యర్థి శేఖర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, పట్టభద్రులు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ఉదయ్‌కిరణ్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా అనుముల ఉదయ్ కిరణ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో పద్మశాలి ఐక్యత కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.